## ఫెంగ్ షుయి



# చివరి అంతస్తులో ఫ్లాట్ కొంటున్నారా?!

పిల్లల చదువుల పేరుతో, ఉద్యోగాల పేరుతో, వ్యాపారాల పేరుతో నగరాలకు వలసలు పెరుగుతున్నాయి. అక్కడే స్థిరపడే వారి సంఖ్యా పెరుగుతోంది. దీంతో నగరాల్లో గజం స్థలం కూడా లక్షల రూపాయలు పలుకుతోంది. మధ్యతరగతి వారికి స్వంత ఇల్లనేది ఓ కలగా మారుతోంది. ఈ నేపథ్యంలో అపార్ట్‌మెంట్లు ఎక్కువగా వెలుస్తున్నాయి. అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ తీసుకునే వారు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. పైన ఓవర్ హెడ్ ట్యాంక్ ఉంటే చల్లగా ఉంటుందని సహజంగానే అందరూ అనుకుంటూ ఉంటారు. చాలామంది అద్దెకు చేరేప్పుడు కూడా ఇదే విషయాన్ని చూస్తుంటారు. పై అంతస్తులో అద్దెకు చేరాల్సి వస్తే వాటర్ ట్యాంకు కింద ఉండే ఫ్లాట్‌నే కోరుకుంటుంటారు. అయితే ఇది చాలా అశుభం.

నీరు ఎప్పుడూ పల్లానికే ప్రవహిస్తుంది. మనిషి ఎప్పుడూ నీటికి పైభాగంలోనే ఉంటాడు. ఇది అందరికీ తెలిసిన సత్యమే. ఇదే విషయం వాటర్ ట్యాంకు విషయంలో కూడా వర్తిస్తుంది. ఫెంగ్‌షుయి ప్రకారం ఎత్తులో ఉన్న నీరు అపాయకరమైంది. దానికింద అసలు పడుకోరాదు. ముఖ్యంగా పడకగదిపైన ఓవర్ హెడ్ ట్యాంకు లేకుంటే మంచిది. ట్యాంకు నిండాలంటే అందులో నీళ్లు పైపు ద్వారా పడాల్సిందే. ట్యాంకు కింద ఉన్నామంటే, ఆ నీళ్లు మనమీద పడినట్టే లెక్క. నీళ్లు మీదపడుతుంటే ఎలా ఉంటాం? ఉక్కిరిబిక్కిరవుతాం! నేరుగా మనం నీట మునిగి ఉక్కిరిబిక్కిరి కాకపోవచ్చు. కానీ సమస్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతాం. ఈ సమస్యలకు కారణం పడకగది పైనున్న ఓవర్ హెడ్ ట్యాంకే. కాబట్టి, ఓవర్ హెడ్ ట్యాంకు కింద ఉండే ప్లాట్లు కొని కష్టాలను తెచ్చుకోకండి.

*

వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం

## 'సరసి' కథ

వైశంపాయనుడు భార్య సుబ్బాయమ్మతో కలిసి అత్తారింట్లో వున్నప్పుడు ఓ సంఘటన జరిగింది. బావమరిది భగీరథుడు టెంతుక్లాసు పరీక్షలు రాయడానికి ప్రిపేరై తీరా పరీక్షలు ప్రారంభమయ్యే రోజొచ్చేసరికి దిగాలు పడిపోయాడు. అసలే పల్లెటూరు. 'పబ్లిక్ పరీక్ష... పబ్లిక్ పరీక్ష' అని భయపెట్టేశారతన్ని. దాంతో వణికిపోయిన భగీరథుడు ఇంకో గంటలో పక్క టౌనులో వున్న పరీక్ష సెంటరుకు వెళ్లాల్సి వుండగా మెల్లగా ఇంట్లోంచి పారిపోయాడు.

అది గమనించిన వైశంపాయనుడు, సుబ్బాయమ్మ అతని వెంటపడ్డారు. వూళ్లో కుర్రాళ్లంతా కూడా లుంగీలు, పంచెలు ఎగదోసుకుంటూ భగీరథుడి వెంట పరుగులు తీశారు. రోడ్డు మీద అయితే దొరికిపోతాననుకుని పొలాల్లోకి దూకేడు భగీరథుడు.




# బగ్గిగాడు

వూళ్లో జనం అంతా చేలగట్ల మీద అన్ని వైపుల్నించీ చుట్టుముట్టేసి, చివరికి అతగాణ్ణి పట్టేశారు.

సుబ్బాయమ్మ తమ్ముడి తల నిమిరి, వాడికి ధైర్యం చెప్పింది. వైశంపాయనుడు దూరం నించే క్రూరంగా చూశాడు. బావంటే బావమరిదికి భయమూ భక్తీ కూడా. అందువల్ల మారు మాట్టాడకుండా బావ సైకిలెక్కి పరీక్ష హాల్‌కెళ్లాడు. మొదటి రోజు భయం తీరడంతో మిగిలిన పరీక్షలన్నీ ధైర్యంగానే రాశాడు భగీరథుడు.

రిజల్టు వచ్చేక చూస్తే, భగీరథుడు పాస్ కావడమే కాదు స్కూల్ ఫస్టొచ్చాడు!

"ఏ మాటకామాటే చెప్పుకోవాలి, ఈ పుణ్యం అంతా అల్లుడుగారిదే. ఆనాడే కనక ఆయన ధైర్యం చెప్పి, తీసికెళ్లకపోతే మా బగ్గిగాడు ప్యాసయ్యేవాడా?" అంటూ అత్తగారు అందరి దగ్గరా అల్లుణ్ణి పొగిడింది. అది గుర్తు చేస్తూ సుబ్బాయమ్మ గారి దగ్గర గొప్పగా స్టిల్సిస్తూ వుంటాడు వైశంపాయనుడు ఇప్పటికివ్వాడా.

❑